సాక్షి చిత్తూరు

శనివారం । 16 । మార్చి । 2024



జగనన్నే సీఎం కావాలి

సంక్షేమ పథకాలు కొనసాగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. - 8లో



'గూడు'కట్టిన ఆనందం

చిత్తూరులో 'టిడ్కో' గృహాల పంపిణీ పండుగ వాతావరణంలో జరిగింది. 2,832 మందికి ఇళ్లను అందించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
చిత్తూరు	6.29	4.59
పుంగనూరు	6.30	5.04

న్యూస్‌రీల్

బోయకొండ గంగమ్మా.. పాహిమాం



విశేషాలంకరణలో అమ్మవారు

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ పాహిమాం అంటూ శుక్రవారం భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయంలో రద్దీ కన్పించింది. 10–30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.మూడువేల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

నిక్కచ్చిగా ఎన్నికల విధులు

చిత్తూరు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులు విధులను నిక్కచ్చిగా నిర్వహించాలని చిత్తూరు ఎస్పీ జాషువా ఆదేశించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో స్పెషల్‌పార్టీ పోలీసులతో దర్బార్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సంక్షేమం కోసం తాను ఎప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. ఇదే సమయంలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్పెషల్‌పార్టీ సిబ్బందికి త్వరలోనే కిట్లు అందచేస్తామని, ఉండేందుకు ప్రత్యేక బ్యారక్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్ఐ నీలకంటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 825 మంది గైర్హాజర్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 825 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ. సయ్యద్ మౌల తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షలకు 13,272 మంది విద్యార్థులకు గాను 12,447 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

శిక్షణకు హాజరుకాని 16 మంది సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 16 మందిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల ప్రక్రియలో శుక్రవారం పీఓలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణకు గైర్హాజరైన 16 మందిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నేటి శిక్షణకు హాజరుకావాలి

జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైన పీవోలు, ఏపీవోలు శనివారం నిర్వహించే శిక్షణకు హాజరుకావాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 13,14,15 తేదీల్లో జరిగిన శిక్షణకు పలువురు గైర్హాజరయ్యారన్నారు. ఈ సారి గైర్హాజరైతే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు

దళితుల ఇళ్ల స్థలాలపై 'పచ్చ'పాగా



ఇళ్ల స్థలాల్లో నాటిన మొక్కలు, కుసాలతో ప్రహరీ

రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ పాతకురవపల్లెలో దళితుల ఇళ్ల స్థలాలను టీడీపీ నాయకులు ఆక్రమించారు. పాతకురవపల్లెకు చెందిన జి.సుహాసిని, కె.లక్ష్మీకాంత, కె.నారాయణకు 2014లో సర్వే నంబర్ 861, 1754–1లో, చెరువు కింద దళితవాడకు చెందిన ఏ.లక్ష్మీదేవి, ఏ.శ్రావణ్‌కుమార్, నాగమ్మకు సర్వే నంబర్ 1754–1లో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. వీరంతా ఆ స్థలాల్లో పునాదులు వేసుకున్నారు. చెరువు కింద దళితవాడకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఏ.సుబ్బయ్య, ఏ.కుమార్, ఏ. రాంబాబు దౌర్జన్యంగా ఇళ్ల స్థలాలను ఆక్రమించి, మామిడి మొక్కలు నాటి, చుట్టూ రాతి కూసాలతో ప్రహరీ వేశారు. దీనిపై ప్రశ్నిస్తే మీ అంతు చేస్తామని దళితులను బెదిరిస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించి, తమ స్థలాలను ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

టికెట్ల లొల్లి.. నేతల వర్రీ!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయం రంజుగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల ఎత్తులకు ఆశావహులు చిత్తవుతున్నారు. పార్టీ జెండా మోసి మోసపోయామని కొందరు.. పార్టీ కార్యక్రమాలకు డబ్బులు తగలేసి అప్పుల పాలయ్యామని మరికొందరు రగిలి పోతున్నారు. అధికార పార్టీ ఛీకొట్టిన నేతకు టికెట్ ఎలా ఇస్తారని స్థానిక నేతలు నిలదీస్తున్నారు. స్థానికేతరులకు టికెట్ ఇచ్చి అవమానించారని ఇంకొందరు రుసరుసలాడుతున్నారు.



వరదయ్యపాళెం: నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

- జెండా మోసిన వారు వద్దు.. కొత్త వారే ముద్దంటున్న అధినేతలు
- తిరుపతి, సత్యవేడు జనసేన, టీడీపీ అభ్యర్థుల ఎంపికపై ఆగ్రహ జ్వాలలు
- సత్యవేడులో టీడీపీ శ్రేణుల తిరుగుబాటు
- ఆదిమూలాన్ని మార్చకపోతే టీడీపీకి ఓటమి తప్పదని హెచ్చరికలు
- తిరుపతి టీడీపీ, జనసేన వారికి చిత్తూరు శ్రేణులు చీర, గాజులు పంపుతామంటూ హేళన
- శ్రీకాళహస్తిలో జనసేన పార్టీ నేతలపై బొజ్జల సుధీర్ వర్గీయుల దాడి
- ఆందోళనకు సిద్ధమైన ఇరు పార్టీల శ్రేణులు

సాక్షి, తిరుపతి: టీడీపీ, జనసేనలో టికెట్ల లొల్లి రాజుకుంది. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వారిని పక్కనబెట్టి నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారికి, అసలు కండువానే కప్పుకోని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ కండువా కప్పుకోకపోయినా చంద్రబాబు సత్యవేడు అభ్యర్థిగా ప్రకటించారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులంతా శుక్రవారం వరదయ్యపాళెం చేరుకుని నిరసన తెలియజేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలించి అమ్ముకున్న ఆదిమూలంకి ఎలా టికెట్ ఇస్తారని చంద్రబాబుని ప్రశ్నించారు. మొన్నటి వరకు ఆదిమూలం అవినీతిపరుడని చెప్పిన తాము ఇప్పుడు కోనేటికి ఓటేయమని ఎలా అడగాలని నిలదీస్తున్నారు. స్థానిక ప్రజలకు సేవచేయడంలో విఫలమయ్యారని తెలుసుకున్నాకే ఆయన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టానం పక్కనపెట్టిందని గుర్తుచేశారు. అటువంటి నేతను టీడీపీ అభ్యర్థిగా ఎలా నియమిస్తారని ఆ పార్టీ శ్రేణులు ధ్వజమెత్తారు. సత్యవేడు అభ్యర్థి తానేనని నాలుగేళ్లుగా ఖర్చు చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ అయితే రెండు రోజులుగా నివాసానికే పరిమితమై బోరున విలపిస్తున్నట్లు సమాచారం. సత్యవేడు అసంతృప్తి నేతలంతా నేడు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.

తిరుపతి నేతలకు తీవ్ర అవమానం

చిత్తూరుకు చెందిన ఆరణి శ్రీనివాసులు అనుచరులు తిరుపతి జనసేన నేతలను తీవ్రంగా అవమానించినట్లు తెలిసింది. జనసేనకు తిరుపతి అసెంబ్లీని కేటాయించినా.. పోటీ చేసేందుకు బలమైన నాయకులు లేరని, అందుకే చిత్తూరు నుంచి చీరలు, గాజులు పంపిస్తున్నామంటూ అవమానించారంటూ జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ పార్టీ నాయకుల అంతర్గత సమావేశంలో వెల్లడించారు. ఈ విషయంపై తిరుపతికి చెందిన టీడీపీ, జనసేన శ్రేణులు భగ్గుమంటున్నారు. ఆరణి శ్రీనివాసులకు టికెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ తీర్మానం చేసి ఆ లేఖను అమరావతికి పంపినట్లు తెలిసింది. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఓ కల్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. సాయంత్రం తిరుపతి నగరంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. చివరకు అధిష్టానం తిరుపతి టీడీపీ, జనసేన నేతలకు సీరియస్ వార్నింగ్ ఇవ్వడంతో మిన్నకుండిపోయారు. ఆ వెంటనే సమావేశం, నిరసన ర్యాలీలు రద్దు చేసినట్లు ప్రకటించి ఆరణి శ్రీనివాసులు కోసం తామంతా కలిసి పనిచేస్తామని పసుపులేటి హరిప్రసాద్ ఓ వీడియో రిలీజ్ చేయడం గమనార్హం. మరో వైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చంద్రబాబు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని సమాచారం. ఇంకా టికెట్ ఆశించిన తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, ఊకా విజయ కుమార్, జేబీ శ్రీనివాసులు చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

శ్రీకాళహస్తిలో జనసేన వర్సెస్ టీడీపీ

శ్రీకాళహస్తి టికెట్ బొజ్జల సుధీర్‌రెడ్డికి కేటాయించడంతో టీడీపీ శ్రేణులు గురువారం రాత్రి జనసేన కార్యాలయం ముందు బాణసంచా పేల్చి హంగామా చేశారు. జనసేన నాయకురాలు వినూత, అనుచరులను రెచ్చగొట్టేల వ్యవహరించారు. దీనిపై ప్రశ్నించడంతో బొజ్జల అనుచరులు జనసేన శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. ఇంతజరిగినా అధిష్టానం నుంచి కనీసం పలకరింపు కూడా లేకపోవడంతో జనసేనకు రాజీనామా చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఇదిలా ఉంటే పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారని భావించి కోలా ఆనంద్ కొద్ది రోజులుగా ప్రచారం కూడా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరినా ప్రయోజనం లేకుండా పోయింది. వీరంతా నేడు వారి అనుచరులతో సమావేశం కానున్నారు.

నిరసన ర్యాలీ

శ్రీకాళహస్తి టికెట్ ఆశించి భంగపడ్డ జనసేన నాయకులు శుక్రవారం రాత్రి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

యాదవులకు చుక్కెదురు

పొత్తులో భాగంగా పుంగనూరు నుంచి తానే పోటీలో ఉంటానని చిత్తూరు జిల్లా పుంగనూరుకు రామచంద్రయాదవ్ చెప్పుకుంటూ వచ్చారు. బీజేపీ నుంచి లేదా జనసేన అభ్యర్థి తనేనని ప్రకటించుకున్నారు. చివరకు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డినే ఖరారు చేయడంతో యాదవ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీవై పార్టీ పేరుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉంటే.. వెంకటగిరి టికెట్ ఈ సారి బీసీలకు కేటాయించాలని మస్తాన్‌యాదవ్, మరికొందరు చేనేత కార్మికులు ప్రయత్నాలు చేశారు. పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబుని కలిసి విన్నవించారు. రా కదలి రా సమయంలో కూడా బీసీలంతా ఏకమై చంద్రబాబుని కలిసి విన్నవించారు. ఆ తరువాత కూడా సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానం చేసి, ఆ కాపీని టీడీపీ అధిష్టానానికి పంపారు. అయినా ప్రయోజనం లేదు. చివరకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెండో భార్య కుమార్తె లక్ష్మీసాయి ప్రియ పేరును ప్రకటించడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి డాలర్ దివాకర్‌రెడ్డి చంద్రగిరి నుంచి పోటీ చేయాలని గత కొంత కాలంగా బ్యానర్లు, ఫ్లెక్సీలతో హంగామా చేస్తూ వచ్చారు. తరుచూ ఆత్మీయ సమావేశాలు కూడా ఏర్పాటు చేసి నజరానాలు అందిస్తూ పలువురి దృష్టిలో పడేందుకు కిందామీదా పడ్డారు. చివరకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన పులివర్తి నానికి టికెట్ కేటాయించడంతో రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు ఆగ్రహంతో ఉన్నారు.

అడవి బిడ్డల స్వప్నం సాక్షాత్కారం

పలమనేరు ఫారెస్ట్ రేంజ్ కీలపట్ల బీట్ 320వ కంపార్ట్‌మెంట్‌లో కుయ్యవంక(కంపెనీ) గ్రామ ఎస్టీల జీవితాల్లో ఏడు దశాబ్దాల తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెలుగులు నిండాయి. అడవిలో వారు పడిన అవస్థలు, వాటిని తీర్చుకునేందుకు వారు పడిన కష్టాలు వింటే గుండెలు బరువెక్కకమానవు. బందారు ఆకులే గుడిసె గోడలుగా, అడవి గడ్డే పైకప్పుగా ఎండకు..వానకు..చలికి తట్టుకుని బతుకులు ఈడుస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అడవిలోని భూమిపై వారికి హక్కు లభించింది. దీంతో వారు సేద్యానికి, లేదా ఇళ్ల నిర్మాణాలకు మార్గం సుగమమైంది. ఇప్పుడు వారి మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. 'సీఎం జగనన్న మేలును మరువం.. మాదేవుడు నువ్వేనయ్యా' అంటూ ఆనందబాష్పాలతో చెబుతున్నారు. వారి దశాబ్దాల కష్టాల ప్రయాణాన్ని తెలుసుకుందాం..

- కుయ్యవంక గ్రామస్తులకు అటవీహక్కు పత్రాల పంపిణీ
- గుడిసెల నుంచి పక్కా ఇళ్ల నిర్మాణాలకు మార్గం
- అడవిలో మగ్గుతున్న ఎస్టీల బతుకుల్లో వెలుగులు
- కిరోసిన్ బుడ్డీల నుంచి కరెంట్ చూసిన గ్రామస్తులు
- జగనన్న చేసిన మేలును మరువమంటున్న ఎస్టీలు



ఇంటి స్థలాల హక్కు పట్టాలను అందుకున్న కుయ్యవంక గ్రామస్తులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


పలమనేరు/గంగవరం: పలమనేరు ఫారెస్ట్ రేంజ్ పరిధి కీలపట్ల బీట్‌లోని 320 కంపార్ట్‌మెంట్‌లోని కుయ్యవంక(కంపెనీ) గ్రామస్తుల చిరకాల స్వప్నం నెరవేరడంతో పేదింట సంబరం నెలకొంది. ఫీకారణ్యంలో 75 ఏళ్లుగా 22 ఎస్టీ కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మొత్తం 60మంది జనాభా నివస్తున్నారు. అడవిలోకెళ్లి కుంకుడు కాయలు, తేనె, మారేడు గడ్డలు, ఆయుర్వేద మందుల్లో వాడే వేర్లను సేకరించి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కొందరు మాత్రం కాలిబాటన వెళ్లి మాధవరం రైతుల పొలాల్లో కూలి పనులు చేస్తున్నారు. వీరున్న ప్రాంతం అడవిలో మధ్యలో ఉండడంతో గ్రామంగా కూడా గుర్తింపు లేదు. వీరికి ఓటుహక్కు, రేషన్ కార్డు, ఆధార్‌లాంటివి పూతలపట్టు నియోజకవర్గంలో ఉన్నప్పటికీ ఇంటి స్థలాలకు పట్టాలు లేవు. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైయ్యే పక్కా ఇళ్లకు నోచుకోలేదు. ఫలితంగా అడవిలో లభించే బందారు ఆకులే గోడలుగా, అడవి గడ్డే పైకప్పుగా చిన్నపాటి గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

55 కి.మీ ప్రదక్షిణలు చేస్తూ..

ఈ గ్రామం పలమనేరు పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో, కీలపట్లకు పది కిలోమీటర్ల దూరంగా ఉంటుంది. అడవిలో ఈ గ్రామానికి వెళ్లాలంటే రోడ్డు మార్గం లేదు. కాలినడకన మాత్రమే పలమనేరుకు రావాల్సి ఉంటుంది. లేదంటే మాధవరం వచ్చి ఆపై అరగొండ క్రాస్ నుంచి బంగారుపాళెం వచ్చి అక్కడినుంచి పలమనేరుకు రావాలి. దీంతో 55 కిలోమీటర్లను వచ్చి వారి సమస్యను స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో చెప్పుకోవాల్సి ఉంటుంది. గ్రామంలో పెద్దగా చదువుకున్న వారెవరూ లేరు. దీంతో ఏడు దశాబ్దాలుగా పక్కా ఇళ్ల కోసం వీరి పోరాటం కొనసాగింది.

మొన్నటి దాకా కిరోసిన్ దీపాలే దిక్కు

గ్రామానికి మొన్నటి వరకు కరెంట్ లేదు. కిరోసిన్ దీపాలతోనే రాత్రుళ్లు గడిపారు. ఇటీవల ఈ సమస్యను తెలుసుకున్న ఎంపీ రెడ్డెప్ప గ్రామానికి సింగిల్‌ఫేజ్ కరెంట్ సౌకర్యాన్ని కల్పించారు. గ్రామంలో వర్షాలు, గాలులు వచ్చి గుడిసెలు పాడైతేనో లేక తుపానులొస్తే గ్రామస్థులు తలదాచుకోవడానికి మాస్ స్వచ్ఛంద సంస్థ ఓ చిన్నపాటి పక్కా భవనాన్ని నిర్మించింది. వర్షాకాలంలో గ్రామంలోని అన్ని కుటుంబాల వారూ ఆ భవనంలో తలదాచుకుంటూ ఉంటారు.



అడవి మధ్యలో కుయ్యవంక గ్రామంలో ఎస్టీలు నివసిస్తున్న పూరిళ్లు



ఇంటి పట్టాలు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న ఎస్టీలు

పేదల కష్టాలను తీర్చే ప్రభుత్వమిది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమం, వారి ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారు. కుయ్యవంక అడవిలో గుడిసెల్లో కాపురాలుంటున్న వారికి వెంటనే పట్టాలివ్వాలిని ఆదేశించాం. అధికారులు స్పందించి అనుకున్న సమయానికి వారికి పట్టాలివ్వడం సంతోషంగా ఉంది. వారి ఇళ్ల నిర్మాణాలకు కూడా సహకారం అందిస్తాం.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర అటవీశాఖ మంత్రి

మంత్రి పెద్దిరెడ్డి చొరవతో..

అడవిలో మగ్గుతున్న ఎస్టీల సమస్యను పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి ద్వారా అటవీశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. గ్రామంలోని 18 గిరిజన కుటుంబాలకు అడవిలో ఇళ్ల నిర్మాణాల కోసం గురువారం అటవీహక్కుల చట్టం–2006 మేరకు పుంగనూరు మండలం మేలుందొడ్డిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి, ఎంపీ రెడ్డెప్ప చేతుల మీదుగా డీఎఫ్వో చైతన్యకుమార్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, స్థానిక ఎఫ్ఆర్వో శివన్న సమక్షంలో ఎస్టీలకు అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేశారు.

ఇకపై జగనన్న ఇళ్లు

ఇప్పటికే గ్రామంలోని 18 మందికి జగనన్న పక్కా గృహాలు మంజూరయ్యాయి. కానీ వీటికి ఇంటి పట్టాలు లేక.. హౌసింగ్ శాఖ ద్వారా వర్క్ ఆర్డర్లు లేక నిర్మాణాలు ఆగాయి. ఇప్పటికే అక్కడున్న గ్రామస్తులు, ఇటుకలు, కట్టడపు రాళ్లు, ఇసుకను సమకూర్చుకున్నా పట్టాలు లేక అలాగే ఉన్నాయి. ప్రస్తుతం వీరందరికీ పట్టాలు రావడంతో ఇక ఆగ్రామంలోని ఎస్టీలకు పక్కా గృహాలు కట్టుకునే అవకాశం వచ్చింది. దీంతో జగనన్నకు ఎన్నటికీ రుణపడి ఉంటామని ఎస్టీలు ఆనందంగా చెబుతున్నారు.

ఇన్నేళ్లకు ఓ గూడు వచ్చింది



ఇన్నేళ్లుగా ఈ అడవిలో గుడిసెల్లోనే పిల్లాపాపలను వేసుకొని బతుకుతున్నాం. ఎన్నో ఏళ్లుగా ఇల్లు కట్టుకొనేందుకు పట్టాల కోసం పలమనేరుకు తిరుగుతూనే ఉండేవాళ్లం. ఇప్పటికి నేను నా చేతికి పట్టా అందుకున్నా. చాలా సంతోషంగా ఉంది. మేము ఇక ఎలాగైనా పక్కా ఇళ్ళు కట్టుకుంటాం. జగనన్న మేలును ఎన్నటికీ మరువం. – నాగమ్మ, కుయ్యవంక

గతంలో ఎవరూ పట్టించుకోలేదయ్యా..



మా తాతల కాలం నుంచి ఇక్కడే ఉంటున్నాం. గతంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా మా గోడు చెబుతూనే ఉన్నాం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎన్ని సార్లు తిరిగామో లెక్కలేదు. ఎవరూ పట్టించుకోలేదు. ఇక ఎక్కడికైనా వలస వెళ్లాలని అనుకున్నాం. కానీ ఆ దేవుడు జగనన్న మంత్రి పెద్దిరెడ్డి రూపంలో మాకు మేలు చేసి పట్టాలిచ్చారయ్యా.

చంద్రశేఖర్, కుయ్యవంక

పసిబిడ్డలతో గుడిసెలో..



మా గుడిసెలో నా పసిబిడ్డతోపాటు ఐదుగురు ఉంటున్నాం. వర్షం వస్తే నిద్రపోకుండా బిడ్డను వడిలో పెట్టుకుని రేయంతా జాగారం చేయడం మాకు కొత్తకాదు. దేవుడు ఎందుకు ఈ అడవిలో మాకి శిక్ష వేశాడని కుములిపోయేవాళ్లం. మా కష్టాలు తీరాయి. నాకు ఇంటి పట్టా వచ్చింది. ఇల్లు కట్టుకుని హాయిగా ఉంటాం. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

భావని, కుయ్యవంక

పట్టాలు రావేమో అనుకున్నా




మా పెద్దల కాలం నుంచి ఇంటి పట్టాల హక్కు కోసం విన్నవిస్తున్నా దిక్కులేదు. ఇంక రావేమో అనుకున్నా. మా జీవితాలు ఇంతే అనుకున్నాం. జగనన్న ప్రభుత్వం మాపై కరుణించింది. సీఎం జగనన్న దేవుడిలా కరుణించారు. ఇప్పటికి మా స్థలాలకు ఇంటి పట్టాలు వచ్చాయి. ఇంటి నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాం. ఇక ఆనందంగా జీవిస్తాం.

భూదేవమ్మ, కుయ్యవంక

పకడ్బందీగా గ్రూప్–1 పరీక్షలు

- రేపు జిల్లాలో 3 కేంద్రాల్లో పరీక్షలు
- నిమిషం ఆలస్యం అయినా నో ఎంట్రీ
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 9491077356
- సమన్వయ కమిటీ సమావేశంలో డీఆర్ఓ పుల్లయ్య



సూచనలిస్తున్న డీఆర్ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 17న గ్రూప్–1 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు డీఆర్ఓ పుల్లయ్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 3 పరీక్ష కేంద్రాల్లో జరుగనున్న ఈ పరీక్షలకు 2,517 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీసెట్, సీతమ్స్, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పేపర్–1 పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులను అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్ష సమయం పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటకు పంపకూడదని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్, బాల్‌పెన్ మాత్రమే అనుమతించాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదన్నారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ షాపులను పరీక్షలు పూర్తి అయ్యే వరకు మూసివేయించాలని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి సమస్యలున్నా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9491077356 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ గుణశేఖర్‌రెడ్డి, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ అమ్మాజీ, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 18వ తేదీ నుంచి జరుగనున్న పది పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. పది పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ పదవ తరగతి పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి శుక్రవారం విజయవాడ నుంచి డీఈఓలతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో పది పరీక్షల కట్టుదిట్టంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 116 పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నామని డీఈఓ వివరించారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమి స్వాధీనం



బోర్డు నాటిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గుడుపల్లె: ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి స్వాధీనం చేసుకుని శుక్రవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. 'ప్రభుత్వ భూమిలో పచ్చనేతల పాగా' శీర్షికతో 'సాక్షి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గుడుపల్లె రైల్వే స్టేషన్ సమీపంలోని ఒంటిపల్లె రెవెన్యూలోని సర్వే నంబరు 35లో ఉన్న భూమిని తహసీల్దార్ సయ్యాద్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేశారు. దీనిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఏప్రిల్ నుంచి మాతృవందన రూ.6వేలు

చిత్తూరు రూరల్: ఏప్రిల్ నుంచి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద అర్హులైన గర్భిణుల మొదటి కాన్పునకు రూ. 5వేలు, రెండో కాన్పులో ఆడపిల జన్మిస్తే రూ. 6వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు డీఎంఅండ్ హెచ్ఓ ప్రభావతిదేవి తెలిపారు. ఇందుకు విధిగా ఆయా ఆరోగ్య కేంద్ర పరిధిలో గర్భిణిగా పేరు నమోదు చేయించుకోవాలన్నారు. విడతల వారీగా ఆధార్ అనుసంధానం అయిన బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుందని పేర్కొన్నారు.

గూడుకట్టిన ఆనందం

పట్టణ పేదల సొంతింటి కల నెరవేరింది. చిత్తూరు నగరంలోని పూనేపల్లెలో నిర్మించిన టిడ్కో (టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం సగర్వంగా పేదలకు అప్పగించింది. చిత్తూరు మేయర్ అముద, కమిషనర్ అరుణ, టిడ్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటముని, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి తదితరులు శుక్రవారం ఇళ్లను లబ్ధిదారులకు అందచేశారు. దశాబ్దాల కల సాకారం కావడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషం వ్యక్తం చేశారు.

- చిత్తూరులో పండుగలా 'టిడ్కో' గృహాల పంపిణీ
- 2,832 మంది లబ్ధిదారుల కళ్లలో ఆనందం
- రూ.186 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- సీఎం జగనన్న మేలును మరువలేమన్న లబ్ధిదారులు



లబ్ధిదారురాలికి ఇంటి స్థలం పట్టాను పువ్వుల్లోపెట్టి అప్పగిస్తున్న మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా అందిస్తామని ఇచ్చినమాట ప్రకారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారు. చిత్తూరులోని పూనేపల్లెలో నిర్మించిన టిడ్కో అపార్టుమెంట్ల నుంచి 2,256 మందికి ఒక్క రూపాయి తీసుకుని ఇళ్లను అందచేశారు. 365 చ.అ ఉన్న ప్లాటును 240 మందికి, 430 చ.అ ఉన్న ప్లాటును 336 మందికి కేటాయించారు. ఈ రెండు కేటగిరీల్లో 576 మంది లబ్ధిదారులకు రూ.19.26 కోట్లను బ్యాంకు నుంచి రుణాలుగా ప్రభుత్వం అందచేసింది. దీంతో పాటు లబ్ధిదారుల పేరిట ఈ ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసి అప్పగిస్తున్నారు.



చిత్తూరు పూనేపల్లెలో సకల వసతులతో నిర్మించిన టిడ్కో అపార్టుమెంట్‌లు

రూ.186.89 కోట్లు ఖర్చు..

చిత్తూరులో టిడ్కో ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1886.89 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో హౌసింగ్ కోసం రూ.166.35 కోట్లు, కాలనీలో రోడ్లు, కాలువలు, తాగునీటి వసతి, పార్కుల నిర్మాణానికి రూ.12.78 కోట్లు, ఎస్టీపీ-సివరేజ్ ట్రీట్‌మెంట్ (మురికినీటిని శుద్ధి చేసే)ప్లాంట్ల నిర్మాణానికి రూ.4.74 కోట్లు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.3.02 కోట్లు ఖర్చు పెట్టింది.

రివర్స్‌తో నిధులు మిగులు

గత టీడీపీ ప్రభుత్వ హయంలో 300 చ.అ అపార్టుమెంట్లను నిర్మించేందుకు టెండర్లు పిలిచి రూ.275.03 కోట్లతో కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రివర్స్‌టెండర్ల విధానానికి వెళ్లింది. దీంతో రూ.230.19 కోట్లకు కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. ఈలెక్కన ఉమ్మడి జిల్లాలో రూ.40.84 కోట్ల ప్రజాధనం రివర్స్‌టెండర్ల ద్వారా ఆదా అయ్యింది.

జగనన్న మేలు మరువం



ఇది మా జీవితంలో మరువలేని రోజు. మా సొంతింటి కల ఇప్పటికి నెరవేరింది. ఇది పేదల ప్రభుత్వమని సీఎం జగనన్న నిరూపించారు. మేము బతికున్నంత వరకు ఆయన మేలు మరువం. మా కుటుంబంలో ఒకడిగా, మా బిడ్డగా ఇళ్లు ఇచ్చినందుకు సంతోషంగా ఉండాది.

– మస్తాని

ఇంతకన్నా ఏంకావాలి



17 ఏళ్లుగా మేము అద్దె ఇంట్లో ఉన్నాం. సొంతింటి కోసం తిరగని చోటు లేదు. ఎక్కని గడపా లేదు. నాయకులు, అధికారులు చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం. జగనన్న ప్రభుత్వంలో మాకు సొంతిల్లు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ కూడా చేసి పట్టా కాగితాన్ని పువ్వుల్లో పెట్టి ఇచ్చారు. ఇంతకన్నా ఏం కావాలి. ఆయన రుణం తప్పకుండా తీర్చుకుంటాం.

– గాయత్రి

మా అన్న ఇచ్చిన నీడ



ఈ కాలంలో కూడా పుట్టిన వాళ్లే అక్క చెల్లెళ్లకు ఏమీ చేయని పరిస్థితి చూస్తా ఉండాం. అలాంటిది ఏ సంబంధంలేని సీఎం జగనన్న మాకు సొంత ఇంటిని అప్పగించారు. మా కుటుంబం మొత్తం జగనన్నను మరువం. కూలీనాలి చేసుకుని బతికే మాలాంటి ఎన్నో కుటుంబాల్లో దీపాన్ని వెలిగించారు.

– సులోచన

మహిళా విభాగం కార్యదర్శిగా గౌహతి సుబ్బారెడ్డి



పూతలపట్టు(ఐరాల): వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా పూతలపట్టుకు చెందిన గౌహతి సుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిష్టానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. తనకు పదవి వచ్చేలా కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంటలపై ఏనుగుల దాడి



దేవళంపేట వద్ద ఏనుగులు తొక్కేసిన వరి పంట



రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేట పంచాయతీలో శుక్రవారం వేకువ జామున పంటలపై ఏనుగులు దాడి చేసి నష్టం కలిగించాయి. వరిపంటను తొక్కి వేశాయి. పంట నష్టాన్ని శుక్రవారం అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

రైతులకు నష్ట పరిహారం పంపిణీ

గత ఏడాది మండలంలో ఏనుగుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు శుక్రవారం పులిచెర్లలో చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో దాదాపు 30 మంది రైతులకు రూ.2.23లక్షలు పంట నష్టపరిహారంగా అందజేశారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్, రేంజ్ ఆఫీసర్ థామస్ సుకుమార్, సెక్షన్ ఆఫీసర్ కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు పార్లమెంట్ ఆర్ఓగా కలెక్టర్ షణ్మోహన్

- చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్ఓగా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో ఆర్ఓ (రిటర్నింగ్ ఆఫీసర్), ఈఆర్ఓ (ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్)ల పాత్రే కీలకం. ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా ఎన్నికల అధికారి, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్‌గా కలెక్టర్ షణ్మోహన్ ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్ఓగా విధులు నిర్వహిస్తారు. పుంగనూరు నియోజకవర్గ ఆర్ఓగా కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌రెడ్డి, నగరి నియోజకవర్గానికి నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి, జీడీ నెల్లూరుకు ఐటీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ, పూతలపట్టుకు చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, పలమనేరుకు పలమనేరు ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, కుప్పంకు కుప్పం ఆర్డీఓ జి.శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులుగా విధులు నిర్వహించనున్నారు.

ఈఆర్ఓలుగా..

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లుగా పుంగనూరుకు గ్లోరి యా (జెడ్పీసీఈఓ), నగరికి వెంకటరెడ్డి (నగరి ఆర్డీఓ), జీడీ నెల్లూరుకు వెంకటర శివ (ఐటీసీఎల్ ఎస్‌డీసీ), చిత్తూరుకు చిన్నయ్య (ఆర్డీఓ, చిత్తూరు), పూతలపట్టుకు మధుసూదన్‌రెడ్డి (కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ), పలమనేరుకు మనోజ్‌రెడ్డి (ఆర్డీఓ, పలమనేరు), కుప్పంకు శ్రీనివాసులు (ఆర్డీఓ, కుప్పం) ఈఆర్ఓలు విధులు నిర్వహిస్తారు.

సమర్థవంతంగా ఎన్నికల విధులు





మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు, శిక్షణలో పాల్గొన్న పీఓలు, ఏపీఓలు

చిత్తూరు కలెక్టరేట్ : రానున్న సార్వత్రిక ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని పీవోలు, ఏపీవోలకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జెడ్పీ సమావేశ మందిరంలో పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన హ్యాండ్‌బుక్‌ను పూర్తిగా చదివి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకల్లా మాక్ పోలింగ్‌ను నిర్వహించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్ల చే 50 ఓట్లను వేయించాలన్నారు. మాక్‌పోల్ నిర్వహించకుండా పోలింగ్ ప్రారంభించకూడదని తెలిపారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి ఎలాంటి ద్రవపదార్థాలు, మారణాయుధాలు, మీడియాకు అనుమతి లేదన్నారు. పీఓలు, ఏపీఓలకు కేటాయించిన నియోజకవర్గాల్లో ఆర్ఓ ఆధ్వర్యంలో రెండవ విడత శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రెండవ విడత శిక్షణలో ఫారం 12 (పోస్టల్ బ్యాలెట్) ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ సౌందర్‌రాజన్, ఉమామహేశ్వరరెడ్డి, మాధవయ్య, బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానిభాషా, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, డిప్యూటీ కలెక్టర్ శివయ్య, పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

సంక్షేమం కోసం జగనన్నే సీఎం కావాలి

పుంగనూరు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, నూతన శకంగా ఆవిర్భవించిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు కొనసాగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని సింగిరిగుంట పంచాయతీలో ఎంపీ ఆధ్వర్యంలో సిద్ధం కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది తమ వాహనాలకు జెండాలు కట్టి, వైఎస్సార్‌సీపీ జిందాబాద్ అంటు నినాదాలు చేస్తూ ర్యాలీని హోరెత్తించారు. బసివినాయునిపల్లె కూడలిలో ఎంపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి భారీ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. అన్ని వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ, బడుగుబలహీన వర్గాలకు పదవులు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర చరిత్రలో రికార్డు సృష్టించారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనితీరును పలు రాష్ట్రాలు ప్రశంసిస్తున్నాయన్నారు. ప్రజలను మాయమాటలతో మోసం చేసేందుకు చంద్రబాబు అండ్‌కో రానుందని, వారి మాటలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలతో పాటు అన్ని వర్గాల వారు సంతోషంగా ఉండాలంటే జగనన్నను రెండవ సారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రచారకర్తలుగా ఉద్యమించాలని, గ్రామాల్లో తమంతకు తాముగా ప్రచారాలు నిర్వహించి, ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను ఎండగట్టాలని నేర్పాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి , వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 48,444 మంది స్వామివారిని దర్శించుకోగా 23,266 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉపాధితో యువతకు భరోసా

- ఐదేళ్ల కాలంలో వందలాది పోస్టుల భర్తీ
- వైద్య ఆరోగ్యశాఖ, వైద్యవిధాన పరిషత్‌లో వెను వెంటనే భర్తీ ప్రక్రియ
- అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల్లో చిరునవ్వు పూయించింది. ఐదేళ్ల కాలంలో పలు పోస్టులను భర్తీ చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్యశాఖకు ప్రాధాన్యత ఇస్తూ...వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్‌లోని పోస్టులను వెను వెంటనే భర్తీ చేసింది. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించింది. లోటుపాట్లను వెను వెంటనే చక్కదిద్దింది,. దీంతో నిరుద్యోగులకు చేతినిండా పనులు లభించింది. జీవనోపాధి పొందుతున్నారు. పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

సమూల మార్పులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులు 2 ఉన్నాయి. ఏరియా ఆస్పత్రులు 5, సీహెచ్‌సీలు 24, అర్బన్ హెల్త్ సెంటర్లు 18, పీహెచ్‌సీలు 108 దాకా నడుస్తున్నాయి. 2014కు ముందు ఈ ఆస్పత్రులు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా సిబ్బంది కొరత వేధించింది. మధ్యాహ్నానికే ఆస్పత్రులు తలుపులకు తాళాలు పడేవి. దీంతో వైద్య ఆరోగ్య సేవలు అమాడదూరంలో నిలిచేవి. తద్వారా వైద్య ఆరోగ్య సేవలు పేదలకు దూరమైంది. అప్పట్లో పేదలకు ప్రైవేటు వైద్యమే దిక్కుగా మారింది. 2019 తర్వాత వైద్య వ్యవస్థలో పలు మార్పులు వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో ఆస్పత్రి రూపురేఖలు మార్చారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల భర్తీ వివరాలు...

సంవత్సరం	డీఎంఅండ్‌హెచ్ పరిధిలో	డీసీహెచ్‌సీ పరిధిలో	ఎన్‌హెచ్‌ఎం పరిధిలో
2019–20	83	16	99
2020–21	218	107	203
2021–22	123	325	203
2022–23	33	82	63

దీంతో మందులు, మాత్రల లోటుపాట్లను సరిదిద్దారు. పేదల ప్రాణాలకు ఊపిరి పోసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత సిబ్బంది కొరతపై దృష్టి సారించారు. రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు మిలిగిన పోస్టులను ఎప్పటికప్పుడు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీలను పూరించారు. దీంతో ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతకు చెక్ పడింది. ఆస్పత్రులు సిబ్బంది అందుబాటులో ఉండేలా చేశారు. పేదలకు వైద్య సేవలో ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ ఫలితంగా పీహెచ్‌సీల్లో సైతం 24 గంటలు వైద్యసేవలు అందుతోంది.

నాడు

2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇంటికో ఉద్యోగ ఇస్తామని నిరుద్యోగులకు ఆశ చూపారు. నిరుద్యోగ భృతి రూ. 2వేలు ఇస్తామని ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఇంటికో ఉద్యోగం మాట మరిచారు. 2019 ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి అంటూ హడావుడి చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచారు.

నేడు

2019 ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఇస్తామని మాట ఇచ్చారు. వలంటీర్లగా నియమించి నిరుద్యోగులను ఆదుకుంటామన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోని వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న జిల్లాలో 150మందికి పైగా క్రమబద్ధీకరించారు. అలాగే వైద్య ఆరోగ్య, వైద్య విధాన పరిషత్‌లోని అవసరమైనంత మేరకు పోస్టులను వెను వెంటనే భర్తీ చేశారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి.

వందలాది మందికి ఉద్యోగాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో వందలాది మంది ఉద్యోగులకు దక్కించుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య విధాన పరిషత్‌లో ఐదేళ్లకాలంలో 530 పోస్టులను భర్తీచేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో 443, ఎన్‌హెచ్‌ఎంలో 568 పోస్టులు భర్తీ అయ్యాయి. ఇందులో వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడికల్, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్స్, ఎంఎల్‌హెచ్‌పీ, తదితర పోస్టులున్నాయి. వీటిలో ఖాళీలు పడితే మెరిట్ ప్రకారం వెను వెంటనే తీసుకుంటున్నారు. దీంతో నిరుద్యోగులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

వరంలా భావిస్తున్నాను



తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. ఉన్నత చదువులు చదువుకున్నాను. గత ప్రభుత్వంలో ఉద్యోగం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూశాం. ప్రైవేటు ఉద్యోగానికి వెళితే క్యూ కడుతున్నారు. వీళ్లతో పోటీ పడలేక ఇంటికే పరిమితమయ్యాను. సీఎంగా జగనన్న వచ్చాక వైద్యవిధాన పరిషత్‌లోని ఖాళీలను భర్తీ చేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఫారమెడికల్‌కు దరఖాస్తు చేసుకున్నాను.. మెరిట్ ప్రకారం ఉద్యోగం వచ్చింది. వచ్చే సంపాదనతో కుటుంబానికి తోడుగా నిలిచాను. ఇది నాకు వరంలా నిలిచింది. జగనన్న మేలును ఎప్పటికీ మరచిపోను.

– రామ్‌నారాయణ, అర్బన్ హెల్త్ సెంటర్, మురకంబట్టు, చిత్తూరు

నిరుద్యోగులకు అవకాశం కల్పించారు.



బీఎస్సీ (ఆడియోమెట్రీషన్) కోర్సు పూర్తి చేసి నిరుద్యోగంతో బాధపడుతున్న సమయంలో 2022లో ప్రస్తుత ప్రభుత్వం వివిధ శాఖలలో కాంట్రాక్టు పోస్టులకు కంబైండ్ నోటిఫికేషన్ జారీచేసింది. ఆ నోటిఫికేషన్స్ మేరకు నేను దరఖాస్తు చేసుకున్నాను. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో మెరిట్ బేసిస్‌లో నగరి ఆస్పత్రిలో ఆడియో మెట్రీషియన్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం నిశ్చింతగా ఉద్యోగం చేసుకుంటున్నా. ఉద్యోమిచ్చిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– సిద్ధయ్య, ఆడియోమెట్రీషియన్, నగరి ఏరియా ఆస్పత్రి

మాట తప్పకుండా ఇచ్చారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, రెగ్యులర్ పద్ధతిలో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇలా చేయడం వల్ల నాలాంటి చాలా మందికి ఉద్యోగాలు వచ్చాయి. నేను కూడా 2022లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాను. బొమ్మసముద్రంలో పోస్టింగ్ఇచ్చారు. చదువుకున్న చదువు కాంట్రాక్ట్ పద్ధతిలో మెరిట్ ప్రకారం పిలిచి ఉద్యోగమిచ్చారు. ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– శశికళ, ల్యాబ్ టెక్నీషియన్, బొమ్మసముద్రం, గుడిపాల